సీరియల్ కథ :

# మొద్దబ్బాయి కథ

రచన :
శ్రీ రేగులపాటి కిషన్‌రావు.

(గతసంచిక తరువాయి)

'స్నానం చేశావా? మరి ఆ ముఖంనిండా బొగ్గేమిటి?'

'ఇంకా ముఖం కడుక్కోలేదమ్మా?'

'ముఖం కడుక్కోక ముందు స్నానం ఎలా చేశావు?'

'ఎలా చేశాను, చేయరాదా ఏమిటి?' అంటూ భుజంపై నున్న తడిబట్టను మరోసారి పిండేశాడు.

'ఓరి వెధవా! స్నానంచేసి ఇంకా బట్టలుకూడా మార్చ లేదా?'

'ఇదిగో క్షణంలో మార్చుకొనివస్తాను. నువ్వు పర మాన్నం వడ్డించు.'

రాధమ్మ వంటశాలలోకి వెళ్ళిపోయింది.

మారుతి తడి అంగీని విదుస్తుండగా అది పర్రుమని శబ్దంచేస్తూ చినిగిపోయింది. మారుతి వంటశాలవైపు వెళ్ళి ఆ అంగీని తల్లివైపు విసరేశాడు. అది వెళ్ళి ఆమె కాళ్ళ దగ్గర పడింది.

'షర్టు చినిగిపోయింది. మసిబట్టను వాడుకోవాలి' అన్నా డు మారుతి.

రాధమ్మ తడి అంగీనిచూచి అంది, 'ఓరి వెధవా. అంగీ వుండగానే స్నానం చేశావట్రా. నేను ఇంతసేపు చూశాను గానీ గ్రహించనేలేదు. అంగి చినిగిందంటే పాతదగుటవలన చినిగిందనుకుంటున్నాను. అదికాదు అసలువిషయం అంగి తడిగా వుండటంవల్ల విడిచినప్పుడు చినిగిపోయింది. లేక పోతే ఇంకా నెలరోజులన్నా ఆగేదే వెధవన్నర వెధవ. అంగి వుండగానే స్నానం చేశావట స్నానం జ్ఞానంలేని వెధవ,'

'జ్ఞానంలేక కాదమ్మా, సినీమాల్లో ఆడవాళ్ళు బాడీ లంగాలతోనే స్నానంచేస్తూ కనిపిస్తారు. ఆడవాళ్ళే అలా చేస్తూండగా మగవీరుడనైన నేను చేయకూడదేంటి. అసలు నీవు సినీమాలు చూస్తేగా ఈ విషయాలన్నీ తెలియ డానికి.'

'ఛీ! బుద్ధిలేనివెధవ, నేనొకటంటే నువ్వొకటి వదురు తావు. జ్ఞానంలేనివెధవ, ఇంట్లో ఇలా చేస్తావు. ఇక బళ్లో యేం వెలగబెడతావో నాకు తెలియదు నాయనా. అయినా నిన్న నేడేమిటి బళ్ళోకివస్తూ జీతాలు తీసుకుంటూ పాఠాలు చెప్పని పంతులు ముండాకొడుకు ననాలి, వాళ్ళు ఏ కొద్దిగా చెప్పినా నీకు అంతో ఇంతో తెలివి ఒంటబట్టేది.'

మారుతి మరేమి మాట్లాడకుండా అక్కడినుండి వెళ్ళి పోయాడు. తడిలాగు విడిచేసి పొడిబట్టలు తొడుక్కొని ముఖంపై నీళ్ళు చల్లుకొని తువ్వాలతో తుడుచుకొని వంటిం ట్లోకి వచ్చాడు. రాధమ్మ పరమాన్నం వడ్డించింది. మారుతి తినసాగాడు.

రాధమ్మ పగిలిపోయిన పాలకుండ పెంకులను పెంటపై పడేసి పాలుపోయినప్రాంతములో పెంటతో అలికింది. గ్లాసునుకడిగి దాచింది. తర్వాత మారుతి పడకగదిలోకి వెళ్ళింది. పడకబట్టలు చుడుతుండగా దుప్పటి కనిపించ లేదు. వెంటనే మారుతిదగ్గరకువచ్చి 'దుప్పటి ఎక్కడ వేశావురా?' అంది.

తల్లిమాట వినగానే మారుతి గుండెలో రాయి పడి నట్లయింది. చేతిలో పట్టుకున్న పరమాన్నపు ముద్దను కంచంలోపడేసి తల్లి ముఖంలోకి బెదిరి బెదిరి చూస్తూ అన్నాడు. 'నువ్వు చుక్కమ్మఇంటికి వెళ్ళినతర్వాత ఓ దొంగ. కాదు కాదు. రాక్షసుడు. రాక్షసుడుకూడా కాదే మో! అసలు దొంగో రాక్షసుడో నాకు తెలియదు. కాని మనఇంట్లోకి వచ్చాడు. వాడు దున్నపోతులా వున్నాడు. దున్నపోతుకున్నట్టుగానే వానికికూడా తలపైన రెండు కొమ్ములున్నాయి.'

అయితే వాడు దొంగకాదు, రాక్షసుడే. రాక్షసులకే తలపైన కొమ్ములుంటాయి' అంది రాధమ్మ. తను రాక్షసు లను చూచినట్టు. 'తర్వాత ఏమయింది?' అంటూ ఆతురత ప్రదర్శించింది.

మారుతి చెప్పసాగాడు. 'మరేమో వాడు మన ఇంట్లోకి వచ్చి సరాసరి నేను పడుకునేగదిలోకి వెళ్ళాడు,'

'ఆ రాక్షసుడు వచ్చినప్పుడు నువ్వేమి చేస్తున్నావు నాయనా?'

'భారతం చదువుకుంటూ కూర్చున్నాను' అన్నాడు మారుతి కనుబొమ్మలు ఎగురవేస్తూ.

రాక్షసున్ని చూచినప్పుడు నీకు భయం వేయలేదా నాయనా?' అంది రాధమ్మ ఆదోరకంగా ముఖంపెట్టి.

'నాకేం భయం. మరి చెప్తాను విను. వాడు....అదే ఆ రాక్షసుడు గదిలోకివెళ్ళి దుప్పటి పట్టుకొని బయటకు వచ్చాడు. నేను రివ్వున వెళ్ళి వాణ్ణి ఢీకొన్నాను. వాని కొమ్ములు విరిచేశాను. వాని కాళ్ళుచేతులుకూడా విరిచేద్దా మనుకున్నాను. కాని వాడు అంతలోనే కాలికి బుద్ధి చెప్పాడు. వాడు పారిపోతూ పారిపోతూ దుప్పటిని బావిలో పడేసి మరీ వెళ్ళాడు. నేను అప్పుడే బావిలో దిగి దుప్పటిని దీద్దామనుకున్నాను కాని...'

రాధమ్మ ఆనందాన్ని నటిస్తూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ అంది, 'ఒరే మారుతీ! ఎంత గొప్పపనిచేశావురా. నిజంగా నువ్వు చాలా గొప్పవాడివిరా. దేవతలుకూడా రాక్షసులను ఇంత చిన్నవయసులో చంపలేదు. నువ్వు దేవతలకంటే కూడా గొప్పవాడివిరా. ఏదీ ఆ రాక్షసుని కొమ్ములను చూపించు.'

మారుతి గుడ్లు తేలవేశాడు. వెనువెంటనే కంచంలో చేయిదూర్చి పరమాన్నం తినసాగాడు.

'రాక్షసునికొమ్ములు చూపిస్తావా లేదా?' గద్దించి అడిగింది రాధమ్మ.

'అసలు...అసలు రాక్షసుడు మనఇంటికి రానేలేదమ్మా' మెల్లగా చెప్పాడు మారుతి.

'రాక్షసుడు రానేలేదా, మరి దుప్పటి ఎక్కడ పారేశావు?'

'బావిలో' నేలకు ముఖంవేసి చెప్పాడు మారుతి.

'ఒరి వెధవా! బావిలో ఎందుకు వేశావురా? పైగా అబద్ధాలు...వెధవ ప్రగల్భాలు. వీని ముఖానికి రాక్షసుని కొమ్ములు విరిచాడట.'

'అమ్మా! అసలు ఏమయిందంటే దుప్పటికి మట్టి అంటింది. దానిని బావిలోవేస్తే మట్టి పోతుందనుకున్నాను. బావిలో వేసినతర్వాత దానిమట్టి పోయిందో లేదో తెలియదు. కాని అదిమాత్రం బావిలో మునిగిపోయింది.'

'ఓహో, అదా అసలువిషయం. ఈమాత్రందానికే ఇన్ని అబద్ధాలెందుకురా ఆడడం. ఇప్పుడుమాత్రం మునిగిపోయిందేముంది. బావిలో దిగి ఆ దుప్పటిని తియ్యి.'

'నేనా, అమ్మో, అందులో కప్పలున్నాయి.'

'కప్పలుంటేమాత్రం అవి నిన్నేమి చేస్తాయిరా?'

'ఏమో, కరుస్తాయేమో, అమ్మో నాకు భయం.'

'కప్పలకు భయపడడమేమిట్రా! అవి పులులా, సింహాలా భయపడడానికి.'

'పులులసంగతీ, సింహాలసంగతీ నాకు తెలియదు గానీ, కప్పలుమాత్రం. అమ్మో నాకు భయం.'

'పిరికి వెధవ, దుప్పటి ఎవరితోనైనా తీయిస్తాను గానీ, నువ్వు బడికివెళ్ళు.'





మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మానసర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్ లాక్ * ఓవిన్
* టిప్ టాప్ * కింగ్ కాంగ్
* కైరాజ్ * రాకెట్

ఇవికాక ❖ జెట్టీలు ❖ లండన్ ❖ సిమిత ❖ బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.

మారుతి మరేమీ మాట్లాడకుండా బయలుదేరాడు. అప్పుడు పదిగంటల నలభై మూడు నిమిషాలైమయింది.

లెక్కలు చెప్పించుకోవడానికి మారుతి పక్కింటి మాష్టారుదగ్గరికి పోనేలేదని మారుతి బడికి వెళ్ళిపోయిన తర్వాత రాధమ్మకు జ్ఞప్తికి వచ్చింది.

మారుతి బడికి చేరుకునేసరికి రెండవపీరియడ్ నడుస్తూ వుంది. అప్పుడు ఎనిమిదవతరగతిలో తెలుగుమాష్టారు రామశర్మ పాఠం చెపుతూవున్నాడు.

మారుతి తరగతిగదిలో ప్రవేశించగానే విద్యార్థులంతా నవ్వారు.

రామశర్మ మాష్టారు విద్యార్థులవైపు కోపంగా చూస్తూ 'సైలెన్స్ ప్లీజ్' అన్నాడు.

అప్పుడు విద్యార్థులు కొందరు నోళ్ళపైన అరచేతులు పెట్టుకొని మాష్టర్‌గారికి శబ్దం వినిపించనంత మెల్లగా నవ్వారు.

'ఏమోయి మారుతీ! లేటుగా రావడానికి కారణమేమిటి!' అన్నాడు మాష్టారు.

'నాకు తెలియదుసార్.'

'నీకు తెలియదా?' ఆశ్చర్యపోయాడు మాష్టారు.

లేటు బడికిరావడానికి రాకపోవడానికి కారణం నాకెలా తెలుస్తుంది సార్.

మాష్టారు కొంచెం ఆలోచించి అడిగాడు. 'లేటుఅంటే నీకేమర్థమయింది?'

'లేటంటే నాకు తెలియదనుకున్నారేంటి. అపర్ణకు మానీటర్ పెట్టిన పేరది, పూర్తిపేరు లేటు బ్యూటీ.'

మానీటర్ టక్కున నిలబడి 'లేటు బ్యూటీ కాదోయ్, లైట్ బ్యూటి.' అని చటుక్కున కూర్చున్నాడు. విద్యార్థులంతా గొల్లున నవ్వారు.

'మారుతీ! కూర్చో' అన్నాడు మాష్టారు కోపంతో.

మారుతి కూర్చున్నాడు.

మాష్టారు మానీటర్‌నుమాత్రమే కాకుండా విద్యార్థులందరినీ పరిశీలించి అన్నాడు విద్యార్థులారా! మీరు ఆడపిల్లలను అవమానం చేయకూడదు. పరాయి ఆడపిల్లలను అవమానంచేస్తే మీకేం లాభం వస్తుంది?'

'లాభంవస్తే అవమానం చెయ్యొచ్చాసార్' అన్నాడు ఒక విద్యార్థి. ఆమాట ఏ విద్యార్థి అన్నాడో తెలుసుకోలేక పోయాడు.

'ఎవరది!' అన్నాడు పెద్ద కంఠంతో.


పిల్లలందరు బుద్ధిమంతుల్లాగా నిశ్శబ్దంగా కూర్చున్నారు.

మాష్టారు మళ్ళీ చెప్పసాగాడు. 'లాభం వున్నా లేకపోయినా ఆడపిల్లలను అవమానం చేయకూడదు. అసలు ఆడపిల్లలను మీరెందుకు అవమానం చెయ్యాలి? మిమ్మల్ని ఎవరైన అవమానిస్తే మీకు బాధకలుగదా? అలాగే ఎవరికైనా బాధ కలుగుతుందని భావించి నడచుకోవాలి. అసలు మన భారతదేశంలో ఆడవాళ్ళు నిన్న మొన్నటివరకు చీకటిలోపుట్టి చీకటిలోపెరిగి చీకటిలోనే మరణించారు,'

'ఆడవాళ్లు చీకటిలోపుట్టి, చీకటిలోపెరిగి, చీకటిలో చచ్చిపోయారా?' విద్యార్థులు ఆశ్చర్యపోతూ గుసగుస లాడసాగారు.

మాష్టారు విద్యార్థుల ఆశ్చర్యాన్నిగమనించి మళ్ళీ ఇలా చెప్పసాగాడు. 'చీకటి అంటే ఇక్కడ అజ్ఞానం అని అర్థం. స్త్రీలు అజ్ఞానంతోవుంటే దేశము బాగుపడదని యెంచి మన సంఘసంస్కర్తలు కొందరు స్త్రీలను వెలుగులోకి తీసుకరావడానికి ప్రయత్నించారు. అంటే స్త్రీలను విద్యావంతులను చేయడానికి ప్రయత్నించారు, వాళ్ళ కృషిఫలితంగా స్త్రీలు అన్నిరంగాలలో ప్రవేశించి పనులు చేస్తున్నారు. ప్రగతి సాధిస్తున్నారు. పూర్వకాలంలో స్త్రీలు ఇల్లుదాటి బయటకు వచ్చేవాళ్ళుకాదు. చదువుకునేవాళ్ళు కాదు. ఉద్యోగాలు చేసేవాళ్ళు కాదు; వాళ్లు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేక చదువుసంధ్యలు లేక ఎంత హీనస్థితిలో వుండేవాళ్ళో మీరే ఆలోచించండి. నేటిస్త్రీలు విద్యనభ్యసించి అన్ని రంగాలలో పనిచేస్తున్నారు; కాని పురుషులలో ఉన్నంతమంది విద్యావంతులు ఇప్పటికీ స్త్రీలలో లేరు. ఇప్పటికీ స్త్రీవిద్యను ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఎంతైనావుంది, విద్యావంతురాలైన స్త్రీ తన బిడ్డలను తెలివికలవారిగా తయారు చేస్తుంది. అప్పుడే దేశం బాగుపడుతుంది. చదువుకునే అమ్మాయిలను మీరు ప్రోత్సహించాలి. అంతేకాని హేళన చేయకూడదు. వాళ్ళకు మారుపేర్లనుపెట్టి అవమానం చేయకూడదు.'

మాష్టారు చెప్పడం ఆపేశాడు. విద్యార్థులు ఇంకా ఏదో గుసగుస లాడుతూనేవున్నారు. వాళ్ళు అలా గుసగుస లాడుతూ చిలిపిగా మాట్లాడుతూ అల్లరి చేసినప్పుడు అతడు నల్లబల్లమీద కఠినమైనవాక్యాలు వ్రాయిస్తాడు. అలా చేయడంవలన విద్యార్థులు నిశ్శబ్దంగా వుంటారని అతని అభిప్రాయం. అనుభవంకూడా.




జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు !

• జిపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్ మో.

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

——— తయారించువారు ———

Grams : JUPITER Phone : 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,
TIRUPUR - 638 602.

అతడు నల్లబల్లమీద విద్యార్థులచేత వాక్యాలు వ్రాయించసాగాడు. మారుతివంతు వచ్చింది. ఆతనివంతు వచ్చినపుడు ఎప్పుడైనా మాష్టారు చాలా సులభమైనవాక్యాలు చెప్తారు. చదువులో మారుతిస్థాయి అతనికి తెలుసు. అతడు 'గుర్రము గడ్డి తినదు' అని చెప్పాడు.

మారుతి నల్లబల్లమీద 'గొర్రె గుడ్డు తినును' అని వ్రాశాడు.

అంతవరకు నవ్వాపుకుంటున్న విద్యార్థులు ఫక్కున నవ్వేశారు. మాష్టారుకూడా నవ్వకుండా ఉండలేకపోయాడు. తదుపరి అతడు మారుతిని 'నక్షత్రములు' అనేపాఠం చదువమన్నాడు.

మారుతి పుస్తకం తెరచి 'నక్షత్రకుడు' అనేపాఠం చదువుతున్నాడు.

మాష్టారు పుస్తకములో పేజీనెంబరుచెప్పి మరోమారు 'నక్షత్రములు' అని పాఠంపేరు చెప్పాడు.

మారుతి చదువసాగాడు.

'చీకటిరాత్రులందు మేకలులేని ఆకాశమును తినిన మనకు లెక్కలేనన్ని కుక్కలు పుట్టును.'.

అతడు పాఠం తప్పులతో చదివినందుకు విద్యార్థులంతా కడుపుబ్బ నవ్వారు.

మారుతి చదివిన అంశం పుస్తకములో ఈవిధంగా వుంది.

'చీకటిరాత్రులందు మేఘములులేని ఆకాశమును తిలకించిన మనకు లెక్కలేనన్ని చుక్కలు ప్రకాశించును కనబడును.'

మాష్టారు మారుతి ముఖంలోకి చూస్తూ ఏదో అనబోయాడు. కాని అంతలోనే గంట మ్రోగింది.

* * *

'మారుతీ!'

తల్లి పిలుపు వినబడగానే గబగబావచ్చి ఆమె ముందు నిలబడ్డాడు మారుతి.

'గతమాసం లెక్కలపరీక్షలో నీకెన్నిమార్కులు వచ్చాయో జ్ఞాపకముందిరా?' అని అడిగిందామె.

అతడు జ్ఞాపకం లేదన్నట్టు తల వూపాడు.

మార్కులు వస్తేగా జ్ఞాపకముండడానికి. నాకు జ్ఞాపకముందిరా, నీకానెలలో బాతుగుడ్డు వచ్చింది.'

మారుతి నేలకు ముఖంవేశాడు.

నేలచూపులు చూస్తావెందుకురా? పోయిన పరీక్షలు ఎలాగూ పోయాయి. ఈనెలలోనైనా లెక్కలపరీక్షలో కొంగ గుడ్డో, కోడిగుడ్డో, బాతుగుడ్డో కాకుండా చాలా మార్కులు తెచ్చుకోవాలి నువ్వు.'

తెచ్చుకుంటానన్నట్టు తల వూపాడతడు.

'ఎనిమిదవతరగతి చదువుతున్న నీకు నాల్గవతరగతి లెక్కలుకూడా సరిగా రావాయే. అలాంటప్పుడు మార్కులు ఎలా వస్తాయి, ఎలా పాసవుతావు?' (సశేషం.)